# సుందరమూర్తి-సోంవారం

ఎలాగైతేనేం, ఒక్కరోజు సెలవు దొరికి నా ప్రయాణం ఖరారవడంతో ఉదయం మొదటిబస్సుకే విశాఖ బయలుదేరాను. బస్సులో అడుగుపెట్టినప్పటి నుండి విశాఖకి దగ్గరలోనే ఇల్లు కట్టుకుని గృహప్రవేశంచేసి, ఆ ఇంటిలో తిరుగాడుతున్నట్టే నాకు కలలురాసాగాయి. ఇప్పుడా కలలు నిజంచేసుకోడానికే మా సుందర మూర్తి 'రమ్మని' ఉత్తరం రాస్తే బయలుదేరా.

మంచు మునుగుల్ని తొలిగించుకుంటూ మా బస్సు ముందుకు దూసుకుపోతూంటే, దారిపక్కన చెరకు తోటలు, చెరువులు, తోటలు, పొలాలు, చిన్నచిన్నపల్లెలు, ఊళ్ళూ- అన్నీ నాకు అందంగా, అద్భుతంగా ఆ మంచు మేలి ముసుగులోంచి కనిపించసాగాయి.

జనం ఎప్పుడు నిద్రలేచారో ఏమిటో - దారిపక్కన కోవెలలోకి శుభ్రమైన బట్టలు కట్టుకుని పరుగెడుతూంటే, అప్పుడు గుర్తొచ్చింది 'కార్తీక సోమవారమ'ని. ఉపవాసాలు, జాగరాలు అలవాటులేని నాకు ఏ వారమైనా ఒకటే అయినా, జనం భక్తి శ్రద్ధలు చూస్తే ముచ్చటేసింది.

పదకొండు గంటలకల్లా రెండు బస్సులు మారి సుందరమూర్తి ఊరు చేరాను. చాలాకాలం తర్వాత వచ్చానేమో ఊరిని గుర్తుపట్టలేకపోయాను. సుందరమూర్తి డాబాఇల్లు ఇప్పుడు పెద్దమేడ అయింది. సుందరమూర్తీ మారిపోయాడు. నన్ను చూస్తూనే ఆప్యాయంగా 'రారా! దీక్షితులు.' అంటూ ఆహ్వానించాడు. చెప్పకేంగాని మా సుందరమూర్తి ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. మనిషినిండుగా, ఎదుటి మనిషికి ధైర్యంచెప్పే రూపంతో ఉంటాడు.

నే వెళ్ళేసరికి ఎక్కడికోవెళ్ళాలన్నట్టు చాలా హడావుడిగా ఉన్నాడు. నుదుటన విభూదిరేఖలు, గుండ్రని కుంకుమబొట్టు పెట్టుకుని, పట్టుబట్టలు కట్టుకుని, మెడలో రుద్రాక్షమాల. బంగారుగొలుసు, రెండు చేతి వ్రేళ్ళకి ఉంగరాలు ఈ మధ్య కొత్తగా చేరిన అలంకారాలుగా నాకు కన్పించాయి. 'ఏమైతేనేం సుందరం ఇంట్లోఉన్నాడు ఇక పని అయినట్టే' అనిపించింది నాకు.

"రారా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు ఇంట్లోరుద్రాభిషేకం పూర్తయింది. కార్తీక సోంవారంకదా. అందునా ఇది మూడోవారం. అందరికీ పట్టే. ఉదయం మూడుకులేస్తే తొమ్మిదివరకూ శివాలయాల్లో అభిషేకాలు. ఇంటిదగ్గర మనపని తప్పదు కదా. ఇప్పుడు రుద్రాభట్ల వాళ్ళింట్లో రుద్రాభిషేకం- వెళ్ళాలి. నీవు కాస్త స్థిమితపడ్డ తర్వాతేలే. వస్తేనీవురా." అంటూ "అమ్మాయి ఆహల్యా! మీ మావయ్యగారికి కాస్త మంచితీర్థం పట్రా" అని ఆజ్ఞ జారీచేసి "మరేవిట్రా సంగతులు?" అన్నాడు.

"సంగతులకేమిటున్నాయి? అంతాక్షేమం. ఇదిగోనీ వేవో ఇళ్ళస్థలాలు

ఉన్నాయి. రమ్మంటే ఒక్కరోజు సెలవు సంపాదించుకొనివచ్చా. నన్నొక ఇంటివాడిని చేసే పుణ్యం నీదే.'' అన్నాను మంచినీళ్ళందుకుంటూ.

"భలేవాడివే! ముందు దాహం తీసుకో. నిన్నునేను వదిలేస్తానా. దారిలో అన్నీ మాటాడుకుందాం పద'' అని నన్ను లేవదీశాడు. నే బయలుదేరబోతూంటే ''మావయ్యగారూ! బాబాయిగారికీ ఇవాళ సోంవారమేనా?'' అని ఓ పదిహేడేళ్ళ అమ్మాయి అడుగుతూంటే-

''ఆ! ఆ! కార్తీక దామోదరుడు వచ్చినట్టు వచ్చాడు. ఎలా వదులుకుంటాంచెప్పు? మీరే కోవెళ్ళకైనా వెళ్ళాలని ఉంటే త్వరగా వెళ్ళి వచ్చేయండి. మాకూ వేళవుతోంది. పదరా! ఇది నా మూడో కూతురు చదువుతోందిలే. పెళ్ళి చెయ్యాలి. మంచి కుర్రాడుంటే చెప్పు. కట్నం బాగానే ఇద్దాం.'' అంటూంటే వీధిలోకి కారొచ్చి ఆగింది.

మేమిద్దరం కారులో బయలుదేరాం. దారిలో నా జాగా సంగతి తప్ప ఎన్నెన్నోమాట్లాడాడు. ఇళ్ళు వాకిళ్ళు- పిల్లల పెళ్ళిళ్ళు- కోడళ్ళ మంచితనం-కాన్వెంటు చదువుల మనవల ముచ్చట్లు- అన్నీ. అన్నిటికి ఊకొట్టక తప్పలేదు. మా కారు ఓ పెద్ద మేడ ముందాగింది. ఆ ఇంటివాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళు కాబోలు ఇంటా బయటా వైభవం తొణికిసలాడుతోంది. ఆడమగ ఖరీదైన బట్టలతో, నగలు నాణ్యాలతో మా సుందరాన్ని పలుకరించారు.

సుందరం పేరు పేరున అందర్నీ పలుకరిస్తూ అభిషేకానికి అన్నీ సిద్ధ చేయిన్నూ, నన్నూ వాళ్ళకి పరిచయంచేన్నూ ఓ గ్లాసుడు మంచినీళ్లిప్పించే పుణ్యంకట్టుకున్నాడు. ఉదయం హడావుడిగా బైలుదేరానేమో కాఫీతప్పమరేమీ ఎరగను. దారిపక్క హోటళ్ళలో తిండి నాకునచ్చదు. ఎలాగూ భోజనం వేళకే వెళ్త న్నాను కదా అని సుందరం ఇంటికే పరుగులెత్తానుగాని, ఇతగాడి కీరోజున ఇంత కార్యక్రమం ఉంటుందనుకోలేదు.

వేళకు ఇంత తిని కాలేజీకెళ్ళే నాకు ఇది కాలాతీతమే. అందుకే మంచి నీళ్లు అమృతప్రాయమ్ అనిపించాయి. అభిషేకం మొదలైంది. నేను ఓ వాలుకుర్చీలో కూర్చుని ఇంటికోసం కలలుకంటూ నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాను. తీర్థం ఇవ్వడానికి సుందరంవచ్చి లేపితేనే గాని మెలకువరాలేదు. ఘనంగా దక్షిణలు అందుకుని 'పదరా' అన్నాడు సుందరం. నేను బయలుదేరాను అతనితోఅదే కారులో వాచీ చూసుకుంటూ.

అప్పుడే ఒంటిగంట అయిపోయింది. కాలేజీలో లంచ్ టైం.నాకు ఆకలిదంచేస్తోంది. ఇంటికెళ్లి కొద్దిగా ఓముద్ద తిని కొద్దిగా విశ్రాంతి తీసుకుని సుందరంతో జాగాలు చూడడానికి వెళ్ళాలి' అనుకుంటూండగా సుందరమే అన్నాడు. ''మా పెద్దాడికిచెప్పాను. వాడు నిన్ను తీసుకెళ్ళి ఓ మూడు నాలుగు జాగాలున్నాయట- చూపిస్తాడు. ఏది నచ్చితే అదే నికరం చేద్దాం.'' అన్నాడు.

మేము ఇల్లు చేరేసరికి ఇంట్లో సుందరం తల్లి మహాలక్ష్మమ్మతప్ప ఎవరూలేరు. "వీళ్ళూవెళ్లారా!" అని అడిగాడు సుందరం, తల్లిని కాళ్ళు కడుక్కుంటూ.

"ఆ! అంతా వెళ్ళారు. పెద్దాడు పెళ్ళం 'పుణ్యగిరి', రెండోవాడు, భార్య 'దేవీపురం' నీ పెళ్ళం కూతురు 'లింగాల తిరుగుడు వెళ్ళారు. ఇదో నేనే ఉన్నాను. అవునూ! దీక్షితులుగార్నీ ఉపవాసముంచేస్తున్నావా ఇవాళా?"

"నేను ఉపవాసం చేయించడమేవిటమ్మా! మూడో సోంవారం, కార్తీకమాసం. కోరిన కోరిక తీర్చే వేల్పులా వచ్చాడు కార్తీక దామోదరుడు. ఇప్పడే రెండు దాటు తోంది. మరో మూడుగంటలు. కాస్త ఎండవాలగానే మడి కట్టుకో. ఏరా దీక్షితులు ఏవంటావు?" అన్నాడు.

నేనేవంటాను! పుట్టిపెరిగి జ్ఞానం వచ్చిన నాటినుండి ఉపవాసాలు, జాగరాలు ఎరగను. వేళకింత తిని వేళకు నిద్రకొరిగితే సరేసరి. లేకపోతే మర్నాటికి మనిషినే కాలేను. అలాగనినేను తిండికి బకాసురుడ్ని, నిద్రకు కుంభకర్ణుడ్ని కాను. నాబాధ సుందరంతో ఎలా చెప్పకోవాలో తెలియ లేదు. వ్యాసుడికి తెలిసిన ఆకలిబాధ నాకు తెలిసింది.

పంచెమార్చుకుని వాలుకుర్చీలో ఒరుగుతూ "అమ్మా! కాస్త వేడిగా కాఫీగాని, టీగాని... ఉంటే పాలుగాని.. ఏరా దీక్షితులు నీకు షుగర్ కాని... అమ్మా! ఎందుకైనా మంచిది... వీడికి కాస్త షుగర్ తగ్గించు" అని తల్లికి ఆర్డరు వేసి "జాగాలధరలు మండిపోతున్నాయనుకో. వందలు ఏనాడో దాటిపోయాయి. ఇప్పడంతా వేలమీదే. ఇంకా ధరలు పెరగకముందే కళ్ళు తెరిచావు. ఇంతకీ ఎంత వెనకేశావేమిటి! నీ ఉద్యోగానికి జీతం తప్ప గీతం ఉండదనుకుంటా. అప్పలు చేసి ఇల్లుకట్టాలి. నేనో మాటంటాను ఏమనుకోకు. తెలివి తక్కువవాళ్ళు ఇళ్ళు కడతారట. తెలివైన వాళ్ళు అందులో సుఖంగా కాపురంచేస్తారట. నా ఉద్దేశం నీవు ఇల్లు కట్ట కూడదనికాదు. స్థలాలు కొనుఇల్లు కట్టకు. ధర రాగానే అమ్మిపారేయి. నాలాంటి తెలివి తక్కువవాడు కట్టిన ఇంటిలో కాపురముండు." అన్నాడు.

"ఏవిట్రా అబ్బాయి! ఈ శల్యసారథ్యం. ఏదో చిన్న గూడుకట్టుకోవాలని అబ్బాయొస్తేను. నాయనా! నీవు వాడిమాట్లేవీ వినకు. తట్ట బుట్ట నెత్తినపెట్టుకుని అద్దిళ్ళకని ఎంతకని తిరుగుతావు? నీకోచిన్న గూడుందనుకో నీవేంతిన్నా నిన్ను అడిగేవాళ్ళుండరు. మనింటిలో మనం ఎలాపోయినా అడిగేవారుండరు. ఇల్లు ఇల్లేనాయనా!" అంది మహాలక్ష్మమ్మ కలుగజేసుకుని.

"చాల్లేవేనీగీతబోధ. మాకేమైనా వేడినీళ్ళుపోస్తావా?" అడిగాడు సుందరం. "ఇదో!" అంటూ ఆమె వంటింటిలోకి కదిలింది. ఓ పది నిముషాలు పోయిన తరువాత కాఫీ కప్పలు మా ముందుకొచ్చాయి. నా ప్రాణం లేచొచ్చింది. ఆబగాకప్ప అందుకున్నాను. తాగుతూంటే తెలిసింది. 'అది కాఫీకాద'ని. అందులో జీవంలేదు.

సుందరం పంచదార తగ్గించమంటే ఈమె పూర్తిగా వెయ్యడమే మానేసింది. పాలు అంతంత మాత్రం. 'ఓరేయి!నీ ఉపవాసం సంతకెళ్ల. నన్ను పస్తుపెట్టిచంపు

తున్నావు కదరా!' అని అరవాలన్పించింది. కాని అరపలేక పోయాను. ఆపాటి శక్తీ నాలో ఉడిగిపోయింది.

వేడికాఫీ గడగడాతాగేసి పంచాంగం తిరగేస్తూ ఏదో రాయడం మొదలు పెట్టాడు సుందరం. రాసేసిన కాగితాలకి నాలుగువేపుల పసుపు బొట్లు పెట్టి పదిలంగా పంచాంగంలో పెట్టుకుని మళ్ళావేషం మార్చడంమొదలు పెట్టాడు. పంచె మార్చి, ఇస్త్రీపంచె కట్టి, ఇస్త్రీ చొక్కావేసుకుని, ముఖానికి కాస్త పౌడరురాసుకుని నుదుటన కుంకుమ బొట్టు పెట్టుకుంటూ "అమ్మా! వీడికోసం మడిపంచె ఆరేశారా!" అని అడిగాడు తల్లిని.

"మీరలా వెళ్ళగానే ఆహల్యే ఆరేసింది నాయనా. నీవు మాత్రం శివాలయం నుండి త్వరగా వచ్చేయి. ఇవాళ సోమవారం కూడాను." అందామె.

"అలాగేలేవే! నీవు రెస్టు తీసుకోరా దీక్షితులూ. నేనలా శివాలయంవెళ్ళొస్తా. ఓ నలుగురు భక్తులు వస్తారు. కార్తీక పురాణం వినిపించాలి." అంటూ గడప దిగాడు.

ఇక్కడైనా మా సుందరమూర్తి గురించి చెప్పాలి. మేమిద్దరం ఒకే ఊరివాళ్ళం కాకపోయినా నాలుగు సంవత్సరాలు ఒకే కాలేజీలో చదివాం. వాడు డిగ్రీలో చతికిలపడితే నేను పై చదువులకని వైజాగ్ పరుగెత్తాను.

నాకన్నా ముందే స్వంత ఊరిలో రెవెన్యూ డిపార్టు మెంటులో ఉద్యోగం సంపాధించుకున్నాడు. ఆ తర్వాత ఏ నాలుగేళ్ళకోకాబోలు నాకు ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చిన్నదైనా నలుగురి దగ్గర మంచి నంపాదించుకుని ఇళ్ళు వాకిళ్ళు సంపాదించుకున్నాడు. ఇద్దరు కూతుళ్ళని కలిగివారిళ్ళకే కోడళ్ళుగా పంపాడు. బుద్ధిమంతులైన కోడళ్ళని సంపాదించుకున్నాడు. సుందరం భార్యవాళ్ళని కూతుళ్ళకన్నా ఎక్కువ ప్రేమగా చూస్తుంది. సెలవు దినాల్లో, అవసరమయితే సెలవులు పెట్టి పెళ్ళిళ్ళు, వ్రతాలు చేయించడం, సుముహూర్తాలు పెట్టడం చేస్తూ బాగానే సంపాదించుకున్నాడు. కాని అతనితో వచ్చిన ఇబ్బందేవిటంటే అందరూ తనమాటే వినాలంటాడు. ఛాదస్తమూ బాగానే పెరిగింది.

"పిల్లలెవరూ కనపడరేం?" అడిగాను సుందరంతల్లిని.

"ఇవాళ మూడోసోంవారం కదా. ఇస్కూళ్ళకి సెలవులిచ్చారు. మాపిల్లలంతా మా పెద్దదాని ఇంటికెళ్ళారు. కొడుకులు కోడళ్ళు అంతా దానింటిలోనే భోజనాలు. ఉన్న ఊళ్ళో ఉంది కదా. అదీ కాస్త వెసులుబాటు. కొడుకు కోడలు నీవు నేను-మన నలుగురమే ఉపవాసం. నాలుగు గంటలకు ముందే మడికట్టేసుకుంటాను. రాత్రి ఎప్పుడే విటి తిన్నావేమిటో" అంటూ పెరటిలోకెళ్ళిందామె.

నాకాకలి చచ్చిపోయింది. శరీరమంతా నీరసం ఆవహించింది. న్యూస్‌పేపరు తిరగేయబుద్ధికాలేదు.

ఇంతలో బిలబిలమంటూ దేవాలయాలకు వెళ్ళిన వాళ్ళు తిరిగొచ్చారు. సుందరమూర్తిభార్య అందర్నీ నాకు పేరుపేరునా పరిచయం చేసింది.

"అంకుల్! వస్తారా జాగాలుచూద్దాం" అన్నాడు సుందరం పెద్ద కొడుకు.

"వచ్చింది అందుకనేకదా నాయనా!" అంటూ లేచాను. కదిలే శక్తి లేకపోయినా 'వచ్చిన పని చేసుకోలేకపోతే ఎలా' అనుకుంటూ అతనితో కదిలాను.

స్కూటరు మీద నాలుగు చోట్లకి తిప్పి ఒక్కొక్కదాని గురించి చెప్పాడు." "ఈ జాగానైరుతిపల్లంగా ఉంది. మనం ఎత్తుచేసుకుని ఇల్లు కట్టుకోవచ్చు. ఈ శాన్యం నొక్కేసింది. ఈ జాగా వద్దు... దీనికి వీధిపోటు అంటూ అందరూ వదిలేస్తున్నారు. వీధికెదురుగా ఏవినాయకుడిబొమ్మో పెట్టుకుంటేపనికొస్తుంది. మరో జాగా ఉంది. మూడు సెంట్లు కూడా ఉండదు. లక్షపైనే చెప్తున్నాడు... మనం వెళ్ళేదారిలో ఒకటి ఉంది. చూపిస్తాను. మంచి జాగానే. కానిఅది మనపేరిట పట్టా అవదు." అనిచెప్పి-

"వీటన్నిటికన్నా ఏ ఎపార్టుమెంటులోనో ఓ ఫ్లాట్‌తీసుకుంటే మంచిదేమో అని కూడా ఆలోచించండి. వైజాగ్‌లో నా మిత్రుడే. ఓ బిల్డరున్నాడు. మనం ఎలాచెప్తే అలా. సమయానికి మనం సొమ్ము అందిస్తేచాలు. కోరి నట్టుకట్టిస్తాడు." అని సలహాఇచ్చాడు సుందరం పెద్దకొడుకు. అప్పుడు నాకనిపించింది. 'ఇల్లు' అనేది పేరాశేమోనని.

మేం ఇంటికి చేరేసరికి సూర్యుడు పడమటికెళ్ళి పోయాడు. వంటింలోంచి వంటకాల ఘుమఘుమలు రాసాగాయి. నిద్రపోయిన ఆకలి ఒక్కసారిగా మేలుకొంది. వాచీ చూసుకున్నాను. ఐదున్నర దాటుతోంది. 'చీకటిపడుతోంది. ఇక సుందరంవస్తే భోజనం చేసేయడమే' అనుకుంటూండగానుందరం వచ్చి వీధిలోంచే "వంటలెంతవరకు వచ్చాయి?" అంటూ రంకె వేశాడు. నా వేపు చూసి "వెళ్ళిచూశానా! చిన్న చిన్నమార్పులు చేసుకుంటే మంచిజాగాలే ఆలోచించు" అంటూ పంచాంగం అందుకున్నాడు.

"వంటలయ్యాయి. ఇక మడికట్టుకుంటారా?" అని అడిగింది సుందరం భార్య. నేనానందంగా లేవబోతూంటే "ఇదో వచ్చేస్తున్నా. అయిపోయింది." అంటూ ఓ పది నిముషాలు జాగుచేశాడు సుందరం.

మొత్తానికి మేం బావి దగ్గరకి స్నానాల కెళ్ళేసరికి ఆరు దాటిపోయింది. చలి అందుకుందేమో గడగడ వణుకుతూ, మడిపంచె కట్టుకున్నాను. సుందరం విభూది పిండికట్లు పెట్టుకుంటూ నా నుదుటన, భుజాలకు, మోచేతులకి, వక్షస్థలానికి పెట్టాడు.

"ఏం శరీరమంతా పూసుకుంటే పోలే." అన్నాను సుందరమూర్తితో.

"భేష్, చాలాబాగుంటుంది. అపరపరమేశ్వరుడిలా ఉంటావు. ఆశివుడే నిన్నునాకతి థిగాపంపాడు. కాదు నిజంగా శివుడేదిగొచ్చి నట్టుంది నాకు. దా. కాసేపు సుందరకాండ చదువుకొందాం." అంటూ కుంకుమను తను నుదుటల దిద్దుకుని నాకూ పెట్టాడు.

కార్తీకమాసమంతా సుందరకాండ పారాయణ చేస్తాడట సుందరం. అతని భార్యే చెప్పింది. ఓ అరగంటపోయిన తరువాత పూజా గృహంలోంచి వచ్చాడు. వస్తూనే "చుక్కలొచ్చాయేమో చూసి వడ్డనప్రారంభించండి" అన్నాడు. సుందరం మనవడు, కూతురు పెరట్లోకి పరుగెత్తారు. 'చుక్కలు రావడమేమిటి! నాకు చుక్కలు కనిపిస్తూంటేను' అని నేననుకుంటూండగా "వచ్చినట్టే వచ్చిమబ్బులోకి వెళ్ళిపోయింది తాతగారూ ఒక చుక్క." అన్నాడు మనవడు.

"వచ్చిందికదా! ఇక వడ్డన మొదలెట్టేస్తాను." అంటూ సుందరం భార్యవిస్తరినిండుగా పదార్థాలు వేసి నా ఆకలిని రగిల్చింది. గారెలు, సేమియా పరవణ్ణం- పులిహోర- పెరుగు గారెలు- వేయించిన అరటికాయముక్కలు కొబ్బరి పచ్చడి- వంకాయపులుసు పచ్చడి, వేడివేడి అన్నం- ఓ పక్క వేడి పెసరపప్పు- ఆవక్కన అరటిపండు, పచ్చిమిరపకాయ- నిమ్మ కాయబద్ద- పక్కన గిన్నెలో పులుసు.....నన్ను విజృంభించమని ఆహ్వానిస్తూంటే-

"కార్తీకదామోదరుడికి విస్తరివేశారట్రా" హెచ్చరించాడు సుందరం.

"ఇదిగో! అంతా సిద్ధంచేశాం. శంకర్ వెళ్ళాడు. వెంట పెట్టుకొనివస్తే వీధిలో విస్తరిపెడతాం." అంది సుందరం తల్లి. "కార్తీక దామోదరుడేవిటి? నేనుండగా" అన్నాను.

"ఉన్నావులేరా! కార్తీకసోంవారంనాడు ఉపవాస ముండి కాలభైరవుడికి విస్తరివేసి పెట్టాలి. అది ముట్టుకున్న తరువాతే హస్తోదకం తీసుకోవాలి." అన్నాడు.

"తాతగారూ! కుక్క ఎక్కడా కనపట్టంలేదు. పోనీ రాజుగారి కుక్కను తీసుకురానా. కాకపోతే వాళ్ళు రోజూదానికి మాంసం పెడతారు. పనికొస్తుందా? తెమ్మంటేతెస్తాను" అన్నాడు గడపదగ్గర నిలబడిన శంకర్.

"నాన్నగారూ! చుక్క మళ్ళామబ్బులోకి వెళ్ళిపోయింది" అని సుందరం కూతురు చెపుతూంటే, సుందరం భార్య హస్తోదకం ఇవ్వడానికి సుందరం గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురు చూస్తుంటే, శంకర్‌కేమి సంకేతం అందిందో వాడు వీధిలోకి పరుగెడుతూంటే, సుందరంకూతురు మబ్బులలోంచి చుక్కలను వెతుకుతూంటే... చెప్పకేం...నిజంగా నాకు చుక్కలే కనిపించాయి.

నీరసంతో కళ్ళు మూతలువడ్డాయి. వ్యాసుడు కాశీనెందుకు శపించాలనుకున్నాడో నాకు బాగా అర్థమైంది.

★ ★ ★